పలాస అభివృద్ధికి కృషి చేస్తా

విశాలాంధ్ర - మందస : పలాస నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని పలాస ఎమ్మెల్యే శిరీషా అన్నారు. సోమవారం మకరజోల పంచాయితీ అల్లిమేరక రోడ్డు నిర్మాణానికి భూమిపూజ, రాంపురం పంచాయితీ టి.గంగువాడలో సామాజిక భవన ప్రారంభోత్సవం, నారాయణపురం పంచాయతీ మల్లెనవారిపేటకు రోడ్డుకు, వి.జి.పురం గ్రామంలో సిసి రోడ్డు, నిర్మాణానికి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఎంపిడివో పైల సూర్య నారాయణరెడ్డి, డి.ఇ రవిబాబు, పంచాయితీ ఇంజనీరు యామినిలు పాల్గొన్నారు.

మూలపేట పోర్ట్‌ని పూర్తి చేసి ప్రజలకు అంకితం చేస్తాం

మూలపేట పోర్టును పున: ప్రారంభించిన మంత్రి అచ్చంనాయుడు

విశాలాంధ్ర - సంతబొమ్మాళి : సంతబొమ్మాళి మండలము మూలపేట పోర్ట్ ను త్వరగా పూర్తిచేసి ప్రజలకు అంకితం చేస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చం నాయుడు అన్నారు. మూలపేట పోర్టును మంత్రి అచ్చం నాయుడు సోమవారం పునః ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పోర్టుతో పాటు పారిశ్రామిక, టూరిజం, టౌన్ షిప్ లను అభివృద్ధి చెందితే ఈ ప్రాంతం రూపురేఖలు మారిపోతాయని అన్నారు. నూతన పారిశ్రామిక విధానం వల్ల నియోజవర్గానికి ఎం ఎస్ ఎం ఈ పార్క్ కోసం భూసేకరణ చేయాలని జిల్లా అధికారులకు సూచించామని, దీనివల్ల పదిమంది కలిసి పరిశ్రమ పెడితే 50 మందికి ఉద్యోగ అవకాశాలు కలుగుతాయని అన్నారు. 194 కిలోమీటర్లు తీర ప్రాంతం ఉన్న ఈ రాష్ట్రంలో ప్రతి 60 కిలోమీటర్లకు ఒక ఫిషింగ్ హార్బర్ గాని ఫిషింగ్ ల్యాండ్ గాని ఏర్పాటు చేసే దిశగా ప్రణాళికలు సిద్ధం చేశామని అన్నారు. 2025 జూన్ 12 కల్లా మొదటి బెర్త్ పూర్తి చేసి మొదటి షిప్ ల్యాండ్ అవ్వాలని ఈదశగా పోర్ట్ అధికారులు పనిచేయాలని సూచించారు. భోగాపురం ఎయిర్పోర్ట్కు, మూలపేట పోర్ట్ కు అనుసంధానం చేస్తూ కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాశామని అన్నారు. భోగాపురం నుండి మూలపేట పోర్ట్ వరకు ఆరు లైన్లు రోడ్లు నిర్మాణం చేపడుతామని అన్నారు. ఇసుక, మద్యం లో గత ప్రభుత్వం వేలకోట్లు రూపాయలు దోచుకుందని అన్నారు. మద్యం తయారు చేసిన వాడు జగన్మోహన్ రెడ్డి ట్రాన్స్ఫర్ట్ చేసినవాడు జగన్మోహన్ రెడ్డి షాప్ పెట్టినవాడు జగన్మోహన్ రెడ్డి ఇలా 40 వేల కోట్ల రూపాయలను దోచుకున్నారని విమర్శించారు. ప్రస్తుత ప్రభుత్వం టెండర్ల ద్వారా లిక్కర్ పాలసీ అమల చేశామని ఒక లక్ష 90,000 మంది దరఖాస్తు చేసుకున్నారని ప్రభుత్వానికి 1900 కోట్లు ఆదాయం వచ్చిందని, అలాగే మద్యం అమ్మకాల్లో ఆరు రోజుల్లో 600 కోట్ల రూపాయలు వచ్చిందని మరి ఐదు సంవత్సరాల్లో ఎంత వస్తుందో మీరే అర్థం చేసుకోవాలని అన్నారు. నది దగ్గరికి వెళ్లి ఇసుక ఎంత కావాలంటే ట్రాక్టర్ ద్వారా బండ్ల ద్వారా ఉచితంగా తీసుకుని వెళ్లవచ్చు అని దీనిపై అధికారులకు ఆదేశాలు ఇచ్చామని అన్నారు. మద్యం ఇసుక పై కావాలనే కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని దీనిపై దృష్టి పెడుతున్నట్లు తెలిపారు. అంతకుముందు పోర్టు పరిసర ప్రాంతాలను పరిశీలించారు. దీంతో పాటు జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండర్కర్, జిల్లా ఎస్పీ కె.వి మహేశ్వర్ రెడ్డి, టెక్కలి ఆర్డిఓ కృష్ణమూర్తి, తహశీల్దార్ రమేష్ కుమార్, ఎంపీడీవో జయంత్ ప్రసాద్, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు జీరు భీమారావు,, ప్రధాన కార్యదర్శి రెడ్డీ అప్పన్న, సవ్వాన ప్రసాదరావు, పోర్ట్ అధికారులు పాల్గొన్నారు.

కమిషన్లతోనే కాలయాపన

- బెంతో ఒరియా సామాజిక వర్గంకు న్యాయం జరిగేది ఎప్పుడు

- 300 రోజుకు చేరిన బెంతోరియల రిలే నిరాహార దీక్ష

విశాలాంధ్ర - కవిటి : ప్రభుత్వాలు మారినప్పుడల్లా కమిషన్లు వేయడమే తప్ప రిపోర్ట్‌లు బహిర్గతం చేయడం లేదని మరి బెంతోరియా సామాజిక వర్గం కు న్యాయం జరిగేది ఎప్పుడని ఆ సామాజిక వర్గ నాయకులు ప్రశ్నించారు. ఈ మేరకు సోమవారం మండల కేంద్రమైన కవిటిలో బెంతోరియా సామాజిక వర్గం ప్రజలకి జరుగుతున్న అన్యాయానికి నిరసనగా కవిటి మెయిన్ రోడ్డు బస్టాండ్ ఆవరణలో ఆ సామాజిక వర్గం ప్రజలు చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు సోమవారం నాటికి 300 రోజులకి చేరుకుంది. ఈ కార్యక్రమంలో 300 వ రోజు నిరసనగా వరక గ్రామస్తులు పాల్గొని తమ నిరసనలు తెలియజేశారు. ఈ సందర్భంగా బెంతోరియా సామాజిక వర్గం నాయకులు మాట్లాడుతూ బెంతోరియా సామాజిక వర్గం ప్రజలకి పూర్తి స్థాయిలో కులం,ఉపకులం తో కూడిన కమ్యూనిటీ, నేటివిటీ, డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్లు జారీ చేయని కారణంగా విద్యార్థులు,యువకులు విద్యా, ఉపాధి, ఉద్యోగ అవకాశల్లో తీవ్రంగా నష్టపోతున్నారుని ఆవేదన వ్యక్తం చేసారు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా కమిషన్లు వేయడమే తప్ప రిపోర్ట్ లు బహిర్గతం చేయడం లేదని అన్నారు. ఇందుకు ప్రత్యక్ష నిదర్శనం 2008 లో మహాత్మాగాంధీ నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ రీసెర్చ్ అండ్ సోషల్ యాక్షన్ సంస్థ ఆధ్వర్యంలో ప్రముఖ మానవ శాస్త్రవేత్త ఎస్. ఎన్ రథ నేత్రుత్వంలో ఒక కమిషన్ వేశారు. 2017 మే లో ఆంధ్రయూనివర్సిటీ ఆంత్రోపోలజి విభాగం హెచ్ వో డీ ప్రొఫెసర్ పీ.డీ సత్యపాల్ నేత్రుత్వం లో ఒక కమిషన్ వేశారు. 2019 సెప్టెంబర్ లో విశ్రాంత ఐఏఎస్ జె.సి శర్మ నేత్రుత్వం లో వన్ మ్యాన్ కమిషన్ వేశారు.మరలా 2022 అక్టోబర్లో విశ్రాంత ఐఏఎస్ అధికారి ఐ.శ్యామ్యూల్ ఆనంద్ నేత్రుత్వంలో ఒక వన్ మ్యాన్ కమిషన్ ఇలా ప్రతీ సారి కమిషన్లు వేయడం తప్ప రిపోర్టు బహిర్గతం చేయడం లేదని అన్నారు. క్యాస్ట్ సర్టిఫికెట్ (కమ్యూనిటీ), నేటివిటీ, డేట్ ఆఫ్ బర్త్, ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్) కోసం పలాస రెవిన్యూ డివిజనల్ అధికారికి దరఖాస్తు చేస్తే మీ క్యాస్ట్ సర్టిఫికెట్ సమస్య ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జీ.వో 52 తేది 19-10-2022 సాంఘిక సంక్షేమ శాఖ (ట్రైబల్ వెల్ఫేర్ సీవీ.2) విశ్రాంత ఐఏఎస్ అధికారి ఐ. శ్యామ్యూల్ ఆనంద్ నేత్రుత్వం లో వన్ మ్యాన్ కమీషన్ రిపోర్ట్ బహిర్గతం చేయని కారణంగా ప్రభుత్వం వద్ద బెంతోరియా కులనిర్ధారణ అంశం పెండింగ్లో ఉన్నందున మీకు క్యాస్ట్ సర్టిఫికెట్ (కమ్యూనిటీ, నేటివిటీ, డేట్ ఆఫ్ బర్త్ - ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్)మంజూరు చేయడం లేదని మీ క్యాస్ట్ సర్టిఫికెట్ దరఖాస్తును తిరస్కరిస్తున్నామని ఎండార్స్మెంట్ లేఖ ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి బెంతో ఒరియా సామాజిక వర్గం ప్రజలకి న్యాయం చెయ్యాలని కోరారు. ఈ కార్యక్రమంలో బెంతోరియా యూత్ అసోసియేషన్ అధ్యక్షులు సుమన్ బిసాయి,కార్యదర్శి దుదిష్టి మజ్జి, రమేష్ జెన్న, ప్రదీప్ బిసాయి, హేమసుందర్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా అదనపు వైద్య ఆరోగ్యశాఖ అధికారి శ్రీకాంత్ ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర - టెక్కలి : మండలంలో ఉన్న కే కొత్తూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా అదనపు వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీకాంత్ సోమవారం ఆకస్మిక తనిఖీ చేపట్టారు. ముందుగా ఆసుపత్రిలో ఉన్న డ్రగ్ స్టోర్స్, ప్రయోగశాల, ల్యాబ్ గదులను, మందులు పరిశీలించారు. పిహెచ్సి లో అందుతున్న వైద్య సేవలు గురించి ఆరా తీశారు. సిబ్బంది హాజరు పట్టిక, వివిధ రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రోగులకు మెరుగైన వైద్యం అందించాలని, శానిటేషన్కు ప్రాధాన్యత ఇవ్వాలని సిబ్బందికి సూచించారు. అనంతరం టెక్కలిలో స్థానిక ఆదిఆంధ్ర వీధిలో కొద్ది రోజుల నుండి సీజనల్ వ్యాధులు విపరీతంగా పెరుగు తున్న నేపథ్యంలో లింగాల వలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని టెక్కలి 5 సచివాలయంలో ప్రత్యేక వైద్య శిబిరాన్ని సోమవారం నిర్వహించారు. ఈ శిబిరం వైద్య అధికారి డాక్టర్ భాగ్యశ్రీ నేతృత్వంలో వైద్య ఆరోగ్య సిబ్బంది వైద్య సేవలను అందించారు. ఈ శిబిరాన్ని జిల్లా అదనపు వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. శ్రీకాంత్ సందర్శించారు. ఆయనతోపాటు డిపిఎమ్ఓ సురేష్ కుమార్, వైద్యులు డాక్టర్ గాయత్రి, వైద్య ఆరోగ్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

విశాలాంధ - కవిటి : మండల కేంద్రమైన కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ వైద్య ఆరోగ్యశాఖ వారి ఆధ్వర్యంలో కవిటి కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వారు విద్యార్థులకు అయోడిన్ లోపం వల్ల వచ్చే వ్యాధుల నివారణ పట్ల అవగాహన కోసం వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని నేషనల్ అయోడిన్ డిఫిషియన్సీ డిజార్డర్స్ కంట్రోల్ ప్రోగ్రాం వారు నిర్వహించి, వ్యాసరచన పోటీలో ప్రథమ, ద్వితీయ స్థానం పొందిన బి.పవిత్ర, ఎన్.హాసినిలకు సర్టిఫికెట్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం బెందాళం మల్లేశ్వరరావు, ఆరోగ్య శాఖ సిబ్బంది ఉషారాణి, దేవి, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

దుర్ధశకు ఉత్తమ బహుమతి

విశాలాంధ్ర - మందస : తాడేపల్లిగూడెం బుద్దాల కన్వెంక్షన్ హాలులో శ్రీ కళావేదిక సౌజన్యంతో నిర్వహించిన ప్రపంచ కళా జాతరలో దుర్ధశ ఒడియా నాటిక ఉత్తమ బహుమతి కైవసం చేసుకుందని, వరల్డ్ రికార్డు బుక్‌లో ఈ నాటికను నమోదు చేశామని డాక్టర్ కుమార్‌నాయిక్ అన్నారు. అనంతరం ఉత్తమ ప్రతి నాయకుడిగా తనకు అవార్డును తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బి.శ్రీనివాసరావు, కళా వేదిక అంతర్జాతీయ చైర్మన్ కత్తిమండ ప్రతాప్ ప్రధానం చేశారని తెలిపారు. డాక్టర్ తిరుపతి సాహు రచనా దర్శకత్వంలో సాగిన ఈ నాటికలో డాక్టర్ కుమార్‌నాయిక్, భంజదేవ్ సమంతా పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో స్టాల్ ఏర్పాటు

విశాలాంధ్ర - కవిటి : మండల కేంద్రమైన కవిటి తహసిల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో ప్రకృతి వ్యవసాయ పద్దతులలో పండించిన ఉత్పత్తులతో స్టాల్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్చార్జి తులసయ్య మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో పండించిన ఆకుకూరలు, కూరగాయలు వాడకం వల్ల ప్రతి ఒక్కరు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉప తహసిల్దార్ ఎం.కృష్ణమూర్తి, వీఆర్వోలు వద్ద గిరి,సల్ల నారాయణ, బీరేంద్ర, కల్పన, దామోదర్, రెవెన్యూ సిబ్బంది, ఐసిఆర్పిలు సంతోషి, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదు అత్యంత ముఖ్యం : ఎమ్మెల్యే మామిడి

విశాలాంధ్ర - కొత్తూరు : టీడీపీ సభ్యత్వ నమోదుపై పార్టీ నేతలు ముఖ్య కార్యకర్తలు సమావేశంలో మాట్లాడారు టీడీపీ సభ్యత్వం ఉంటే ఒక కుటుం బానికే భరోసా ఉంటుంది అని ఎంఎల్ఏ మామిడి గోవిందరావు అన్నారు టీడీపీ సభ్యత్వ నమోపార్టీ నుంచి గుర్తింపే కాదు వ్యక్తి గతంగా కూడా ఉపయోగపడుతుంది. అని ఆయన అన్నారు దీనిపై విస్తృతంగా అవగాహన కల్పించాలని శ్రేణులకు పిలుపునిచ్చారు. క్యాంపు కార్యాలయంలో టీడీపీ సభ్యత్వ నమోదుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్లు, క్లస్టర్ ఇన్ ఛార్జిలు, ముఖ్యనాయకులు పాల్గొన్నారు. తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు యొక్క ప్రధాన్యతను వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మామిడి గోవిందరావు గారు పార్టీ శ్రేణులకు సభ్యత్వ నమోదుపై దిశా నిర్దేశ్యం చేశారు. తెలుగుదేశం పార్టీలో వంద రూపాయలతో సభ్యత్వ తీసుకుంటే.. రెండేళ్ల పాటు 2 లక్షల వరకు ప్రమాదబీమా సౌకర్యం ఉండేదని కానీ ఇప్పుడు అదే వంద రూపాయలతో 5 లక్షల వరకు ప్రమాదబీమా సౌకర్యం కల్పించే అంశంపై టీడీపీ అధినేత మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టత ఇచ్చారన్నారు. కుటుంబ పెద్దకు దురదృష్టవ శాత్తు ఏదైనా ప్రమాదం జరిగితే వారి పిల్లల చదువులు, ఉద్యోగాలు ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా అందిస్తుందన్నారు. లక్ష రూపాయలు చెల్లిస్తే శాశ్వత సభ్యత్వం ఉంటుందన్నారు. దేశంలో ఏ పార్టీకి లేని విధంగా కార్యకర్తలకు, పార్టీని నమ్మిన వారికి అండగా ఉండే విధంగా పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి శ్రీ నారా లోకేష్ బాబు చొరవ తీసుకున్నారన్నారు. పార్టీలో ఏవైనా పదవులు కావాలన్నా లేదా ఇతర అంశాల్లో ప్రాధాన్యత ఉండాలన్నా సభ్యత్వ నమోదు తప్పనిసరి అన్నారు. త్వరలో క్లస్టర్ ఇన్ ఛార్జి, యూనిట్ ఇన్ ఛార్జి, పోలింగ్ బూత్ ఇన్ ఛార్జిలకు టెలిగ్రామ్ బాట్ ద్వారా టిడిపి సభ్యత్వం నమోదుకు అనుమతి ఇవ్వడం జరుగుతుందన్నారు. అంతకంటే ముందుగా సభ్యత్వ నమోదుపై విస్తృతంగా అవగాహన కల్పించాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు నాయకులకు, సూచించారు. ఈ కార్యక్రమంలో ఐదు మండల నాయకులు, క్లస్టర్, యూనిట్, బూత్, ఇన్చార్జిలు తదితరులు పాల్గొన్నారు.

వాలంటీర్లకు న్యాయం చేయండి

ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి యుగంధర్

విశాలాంధ్ర - పలాస : వాలంటీర్లకు న్యాయం చేయాలని, అందరికీ ఉద్యోగ భద్రత కల్పించాలని సోమవారం రాష్ట్ర వ్యాప్త కార్యక్రమంలో పలాస ఆర్డీవో కార్యాలయం వద్ద వాలంటీర్లు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం ఎఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.యుగంధర్ మాట్లాడుతూ వాలంటీర్లకు న్యాయం చేయాలని, ప్రభుత్వం బకాయి పడ్డ నాలుగు నెలల జీతం మంజూరు చేయించాలని, రాజీనామా చేసిన వాలంటీర్లను విధుల్లోకి తీసుకోవాలని అన్నారు. వాలంటీర్లకు 10వేల జీతం ఇస్తామని మరి ఉద్యోగ భద్రత కల్పిస్తామని ఇచ్చిన వాగ్దానాన్ని తక్షణమే ఎంప్లాయిమెంట్ చేయాలని, అనంతరం ఏవో ప్రకాశరావుకు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులు గోరు వాసుదేవరావు, పలాస ఎఐవైఎఫ్ నాయకుల పాడి తిరుపతిరావు, రాము, వాలంటీర్లు ధర్మేంద్ర, మురళీ, కె.సురేష్, జి.హరి, మల్లేశ్వరి, ఈశ్వరమ్మ, శ్రావణి, విశాలాక్షి, పుష్పలత, చామంతి, సునీత, తులసి, సింహాచలంలు పాల్గొన్నారు.

విద్యార్థులు సమాజహిత అంశాలపై జ్ఞానం పెంపొందించుకోవాలి

వినియోగదారుల ప్రొటెక్షన్ రైట్ జిల్లా అధ్యక్షులు డా. గంజి ఆర్ ఎజ్రా

విశాలాంధ్ర - శ్రీకాకుళం టౌన్ : విద్యార్థులు సమాజహిత అంశాలపై జ్ఞానం పెంపొదించుకోవాలని, చదరంగం క్రీడను మనసుపెట్టి ఆడటం వలన తెలివితేటలు పెరుగుతాయని వినియోగదారుల ప్రొటెక్షన్ రైట్ జిల్లా అధ్యక్షులు, సంజీవయ్య మెమోరియల్ ట్రస్టు అధ్యక్షులు డా.గంజి ఆర్ ఎజ్రా అన్నారు. నగరంలోని ఇలిసిపురం ప్రాంతంలో గల తిలక్‌నగర్ నర్సెస్ కాలనీలోని స్కూల్ ఆఫ్ చెస్ అకాడమీలో ఆదివారం చిన్నారులతో సండే చెస్ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. వివిధ ప్రాంతాలలోని చిన్నారులు పాల్గొని 5 రౌండ్లపాటు జరిగిన చెస్ పోటీలలో ఆసక్తిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన బహుమతుల ప్రధానోత్సవంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న గంజి ఆర్ ఎజ్రా, ఆయన సతీమణి నవోదయ విద్యాలయం ఉపాధ్యాయని అనీరోజ్ మాట్లాడుతూ. చదరంగం క్రీడ మేధావుల క్రీడ అని, అలాంటి క్రీడలో జిల్లా చిన్నారులు పాల్గొని చెస్ ను నేర్చుకోవడం, పోటీలలో రాణిస్తుండటం, స్కూల్ ఆఫ్ చెస్ అకాడమీ సంస్థ 191 చెస్ టోర్నీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా గంజి ఆర్ ఎజ్రా దంపతులు చేతుల మీదుగా విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ సాయి దుర్గా ట్యూషన్ సెంటర్ ప్రిన్సిపాల్ కె ఉమారాణి, స్కూల్ ఆఫ్ చెస్ అకాడమీ చెస్ కోచ్ లు భేరి చిన్నారావు, కె సాయి నిరంజన్ సింగ్, సీనియర్ చెస్ క్రీడాకారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రోటోకాల్ ఉల్లంఘనపై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర - మందస : మండలం వీరగున్నమ్మపురం పంచాయతీ పరిధిలో ఎమ్మెల్యే గౌతు శిరీషా ఉపాధి హామీ పథకంలో భాగంగా సిమ్మెంటు రోడ్లు నిర్మాణానికి భూమి పూజ చేశారని, శంకుస్థాపన కార్యక్రమానికి ఏర్పాటు చేసిన శిలాఫలకంపై తమ పేర్లు ముద్రించకుండా అవమానించారని మందస మండల వైస్ చైర్మన్, వీరగున్నమ్మపురం ఎంపిటిసి కొర్నాన ఆదినారాయణ, సర్పంచ్ కర్రి గోపాలక్రిష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులైన తమకు కనీసం ఆహ్వానించకుండా శిలాఫలకంలో పేర్లు లేకుండా అధికారులు చేశారని, ప్రోటోకాల్ ఉల్లంఘనకు పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు సమస్యలు పరిష్కరించాలి

జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహమ్మద్ ఖాన్

విశాలాంధ్ర - శ్రీకాకుళం టౌన్ : ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (మీకోసం)లో అందిన అర్జీదారుల సమస్యలను వేగవంతంగా పరిష్క రించాలని. అర్జీల పరిష్కారానికి అత్యధిక ప్రాధాన్యతనిచ్చి సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు పరిష్కరిం చాలని సంబంధిత అధికారులను జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహమ్మద్ ఖాన్ ఆదేశించారు. సోమవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (మీకోసం) కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహమ్మద్ ఖాన్ తో పాటు జిల్లా రెవిన్యూ అధికారి అప్పారావు, జిల్లా పరిషత్ ముఖ్యకార్యనిర్వహణ అధికారి, శ్రీధర్ రాజు, డిఆర్డిఎ, పి.డి కిరణ్, జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి విజ్ఞప్తులు స్వీకరించారు. తొలిత నేటికీ పరిష్కారం కాకుండా పెండింగ్లో ఉన్న దరఖాస్తులపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహమ్మద్ ఖాన్ మాట్లాడుతూ అర్జీదారుల సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలని అన్ని శాఖల అధికారులకు ఆదేశించారు. విచారణ చేసి అర్జీ దారుడు సంతృప్తి చెందేలా నిర్ధీత గడువులోపు పరిష్కరించా లన్నారు. ప్రతి అర్జీని సంబంధిత ప్రధాన అధికారులు వ్యక్తిగతంగా పరిశీలించి ఎండార్స్ మెంట్ ఇవ్వాలని తెలిపారు. ప్రజల సంక్షేమం కోసం అమలుచేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, రెవెన్యూ, పౌర సరఫరాల సేవలు, పేదలందరికీ ఇళ్లు పథకం కింద పట్టాల పంపిణీ, ఇళ్ల మంజూరు, పెన్షన్లు, సర్వే, ఉపాధి అవకాశాలు, భూ వివాదాలు తదితరాలకు సంబంధించి 138 అర్జీదారులు తమ సమస్యల పరిష్కారానికి జాయింట్ కలెక్టర్ వారికి అర్జీలు సమర్పించారు. మీకోసం ప్రజా ఫిర్యాదుల నమోదు మరియు పరిష్కార వేదిక కార్యక్రమంలో డిపిఓ కె. భారతీసౌజన్య, జిల్లా వైద్య ఆరోగ్య అధికారిణి డా. బి.మీనాక్షి, జిల్లా ఉద్యాన అధికారి ఆర్.వి ప్రసాద రావు, బి.సి కార్పొరేషన్ ఇ.డి గెడ్డెమ్మ, ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ శాంతి శ్రీ, డ్వామా పి.డి బి.సుధాకర్ రావు, డి.సి.హెచ్ .యస్ .డా. కళ్యాణబాబు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పోలీసు అమరవీరుల త్యాగం అజరామరం

- మాతృభూమి శ్రేయస్సు కోసం పనిచేసిన నిస్వార్థ శ్రామికులు పోలీసులే

- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

విశాలాంధ్ర - (శ్రీకాకుళం స్పోర్ట్స్/ క్రైం : ప్రజల కోసం పోరాడుతూ అమరవీరులైన వారిని స్మరించుకోవడం మన అందరి బాధ్యత, మాతృభూమి శ్రేయస్సు పనిచేసిన నిస్వార్థ శ్రామికులు పోలీసులు అని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, పశు సంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి మరియు మత్స్య శాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ కె. వి.మహేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహమ్మద్ ఖాన్, శాసన సభ్యులు గొండు శంకర్, ఎన్ ఈశ్వర రావు లతో కలిసి పోలీసు అమరవీరుల స్తూపం వద్ద పూల మాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఆర్మ్డ్ రిజర్వ్ పోలీసు సిబ్బంది నిర్వహించిన స్మృతి పరేడ్ ద్వారా అమర వీరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా కింజరాపు అచ్చెన్నాయుడు మాట్లాడుతూ ఈ రోజు జరుపుకుంటున్న పోలీసు అమరవీరుల దినోత్సవంగా ద్వారా మన చాలా తెలుసుకోవలసినది ఉందన్నారు. దేశంకోసం లడాక్ లో తమ ప్రాణాలర్పించిన ఆశువులు బాసిన అమరవీరులకు నివాళులు అర్పిస్తూ పోలీసుల అమరవీరుల దినోత్సవంగా ప్రతి సంవత్సరం ఈ రోజు జరుపుకోవడం జరుగుతుందన్నారు. దేశం అభివృద్ధి చేద్దాలంటే పోలీస్ పాత్ర చాలా కీలకమన్నారు. విధినిర్వహణలో చాలా కష్టాలు ఉన్నాయన్నారు. దేశంలో పోలీసు వ్యవస్థ ఒకటైతే మన రాష్ట్రంలో పోలీసు వ్యవస్థ పనితీరుపై గర్వపడుతున్నానన్నారు. నక్సలిజం అదుపు చేసి శాంతిభద్రతలు కాపాడు కోవడంలో మంచి పాత్ర పోశించారన్నారు. రాష్ట్రలో గంజాయి, మదకద్రవ్యాలు అరికట్టేందుకు పోలీసులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మాదకద్రవ్యాల రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దాలన్నారు. అందుకు కఠినమైన నిర్ణయాలు తీసుకోవాలన్నారు. విజయవాడలో వచ్చిన వరదలలో పోలీసులు అందించిన సేవలు కొనియాడారు. సైబర్ క్రైమ్ పెరిగిందని దానిని కట్టేందుకు ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. పోలీసులు వారి కుటుంబ సభ్యుల బాధ్యత ప్రభుత్వమే వహించి వారికి రావలసిన ప్రతిదీ సకాలంలో అందేలా చర్యలు చేపట్టాలన్నారు. విధులలో చనిపోయిన పోలీసు కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగ అవకాశం కల్పించడం జరుగుతుందన్నారు. పోలీసులతో సమానం విధులు నిర్వహించిన హెూంగార్డులకు అన్ని విధాలుగా ఆదుకుంటామని, మరణించిన వారికి ఎక్సగ్రేషియా కూడా మంజూరు చేయడం జరుగు తుందన్నారు. ప్రతి పౌరుడు పోలీసు యంత్రాగానికి సహకరించాలన్నారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ ప్రజల కోసం నిరంతర పోరాటం చేస్తున్న పోలీసు సేవలు అభినందనీయమన్నారు. దేశ చరిత్రలో పోలీసు సంస్మరణ దినం విశిష్ట దినంగా భావిస్తున్నామన్నారు. ఆపద సమయంలో వెనకడుగు వేయకుండా ప్రజల పక్షాన పోరాటం చేస్తున్నవారు ఒక్క సైనికులు పోలీసులే అన్నారు. పోలీసు అమరవీరుల దినోత్సవంగా సందర్భంగా దేశంకోసం, రాష్ట్రం కోసం, ప్రజలకోసం ప్రాణలర్పించిన వారికి నివాళులర్పించారు. ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు నిరంతరం పోరాటం చేస్తున్నారన్నారు. అసాంఘిక శక్తుల భారీ నుండి ప్రజలను రక్షించేందుకు పోలీసులు నిరంతరం విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉంటూ అందిస్తున్న సేవలు మరువలేనివని అన్నారు. ఇటీవల కాలంలో రాష్ట్రంలో గంజాయి ని అరికట్టేందుకు పోలీసులు చేస్తున్న దాడులతో గంజాయి అక్రమ రవాణా దారులు గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయని చెప్పారు. పోలీస్ అమరవీరుల దినోత్సవం సందర్భంగా అమరులైన పోలీసులకు ఈ సందర్భంగా ఘనంగా నివాళులర్పించారు. ఎస్పీ కె.వి.మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ మేము విధి నిర్వహనే పరమావదిగా భావిస్తామన్నారు. 1958 అక్టోబర్ 21న భారత (లడాక్) చైనా సరిహద్దుల్లో దేశంకోసం తమ ప్రాణాలర్పించిన ఆశువులు బాసిన అమరవీరులకు నివాళులు అర్పిస్తూ పోలీసుల అమరవీరుల దినోత్సవంగా ప్రతి సంవత్సరం ఈ రోజు జరుపుకోవడం జరుగుతుందన్నారు. దేశావ్యాప్తంగా 216 మంది అమరులయ్యారని అందులో మన రాష్ట్రానికి చెందిన వారు ఇద్దరు ఉన్నారన్నారు. విధి నిర్వహణలో పోలీస్ కుటుంబాలకు దూరంగా ఉంటారన్నారు. ప్రభుత్వం పోలీసులకు అనేక సౌకర్యాలు కల్పిస్తున్నారన్నారు. కారుణ్య నియామకాలు ఈ సంవత్సరం 5 గురికి ఉద్యోగం ఇవ్వడం జరిగిందన్నారు. విడో, ఫ్లాగ్ నిధులనుండి సహాయ అందజేయడం జరుగుతుందన్నారు. హెూమ్ గార్డ్స్ సంక్షేమానికి అనేక కార్యక్రమాలు చేపట్టడం జరితుందన్నారు. మన జిల్లాలోని విధినిర్వహణలో అమరులైన 5 గురు పోలీసులు కుటుంబాలకు జ్ఞాపికలను అందజేసీ సత్కరించారు. కార్యక్రమంలో 2024 సంవత్సరంలో విధులు నిర్వహిస్తూ పరమపదించిన ఉమా మహేశ్వర రావు, సతీష్ మాధవరావు, లక్ష్మణ రావు అను వారి కుటుంబ సభ్యులకు రావలసిన ఆర్థిక సహాయాన్ని ముఖ్య అతిధి అందజేశారు. అనంతరం కార్యక్రమంలో చివరిగా ఓపెన్ హౌస్ ప్రారంభించి తిలకించారు. కార్యక్రమంలో జిల్లా పోలీసు శాఖ రూపొందించిన అమర వీరుల గ్రంథంలో దేశ రక్షణలో ప్రాణ త్యాగం చేసిన 216 అమర వీరుల పేర్లను పుస్తకాన్ని వ్యవసాయశాఖా మంత్రి ఎస్.పి కి అందజేశారు. డి ఎస్ పి వివేకానంద్ పుస్తకంలో పేర్లు చదివి వినిపించారు. ఈ కార్యక్రమానికి అదనపు ఎస్పీ పి శ్రీనివాసరావు, డీఎస్పీ లు వివేకానంద, రాజశేఖర్, శేషాద్రి, ప్రసాద్, అమర వీరుల కుటుంబ సభ్యులు, సీఐలు ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆధ్యాత్మికత భావాన్ని ప్రతి ఒక్కరూ పెంపొందించుకోవాలి

రాజయోగి బికె మంజునాథ్

విశాలాంధ్ర - మెళియాపుట్టి : నేటి సమాజంలో ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికత (భక్తి) భావాన్ని పెంపొందించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని రాజయోగి బికె మంజునాథ అన్నారు. చాపర గ్రామంలోనున్న బ్రహ్మకుమారిస్ (త్రిలోక్ భవన్) చైతన్య శివాలయంలో రాజయోగిని బికె సుధా ఆధ్వర్యంలో సోమవారం నాడు భక్తి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బెంగళూరు నుండి వచ్చిన రాజయోగ టీచర్, ఆధ్యాత్మిక సాధకులు రాజయోగి బికె మంజునాథ్ మాట్లాడుతూ మానవాళి విశ్వశాంతి కొరకు యోగ ప్రయోగ విధానం గూర్చి తెలియజేస్తూనే జీవితాన్ని చక్కగా తీర్చిదిద్దుకునే విషయాల పట్ల మరింత శక్తిని సమకూర్చుకునే విధంగా భక్తి భావం పెంపొందించుకునే క్రమంలో ఆధ్యాత్మిక మేలుకొలుపు, ప్రయోగాత్మక ఆత్మ జాగృతి నిర్వహించి వారికి మేలు చేకూర్చడమే ఓంశాంతి సంస్థ యొక్క లక్ష్యమంగా ముందుకు సాగుతుందని అనేక అంశాలను తెలియపరిచారు. ఈ నెల 20వ తేదీ నుండి 27 వరకు ప్రతిరోజు చాపర బ్రహ్మకుమారి చైతన్య శివాలయంలో వివిధ అంశాలపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఆసక్తి ఉన్న ప్రతి ఒక్కరూ శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అంతకుముందు త్రిలోక్ భవన్ లో మెడిటేషన్ కార్యక్రమాన్ని సైతం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వారితో పాటుగా రాజీయోగినిలు, భక్తులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం ఇచ్చిన పనులును పూర్తి చేస్తే గ్రామాభివృద్ధి

విశాలాంధ్ర - పోలాకి : ప్రభుత్వం ఇచ్చిన పనులు పూర్తి చేస్తే గ్రామాభివృద్ధి చెందుతుందని అందరూ కలిసికట్టుగా పనిచేయాలని నరసన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే బగ్గు రమణ మూర్తి అన్నారు. పల్లె పండగ పంచాయతీ వారోత్సవాలు కార్యక్రమంలో భాగంగా చెల్లాయివలస పంచాయతీ జడూరు గాతలవలస ఆర్అండ్బి రోడ్డు నుండి కుమ్మరపేట గ్రామం వరకు సీసీ రోడ్డు నిర్మాణానికి 25.లక్షల రూపాయలతో మరియు జడూరు గాతలవలస ఆర్అండ్బి రోడ్డు నుండి చింతు వానిపేట గ్రామం వరకు 60.లక్షల రూపాయలతో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం విధులతో బీటీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి భూమి పూజ జరిపారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గ జనసేన ఇన్చార్జి బలగ ప్రవీణ్ కుమార్ సోషల్ మీడియా కన్వీనర్ బగ్గు అర్చన మండల నాయకులు మిరియాపిల్లి వెంకటప్పలనాయుడు మాజీ ఏఎంసీ చైర్మన్ బైరి భాస్కరరావు స్థానిక ఎంపీటీసీ కోట అప్పారావు సంపతరావు రామన్న మాజీ సర్పంచ్ ప్రతినిధి లుకలాపు రాంబాబు చింతు భాస్కరరావు సూరపునాని బి.శ్రీనివాసరావు బోర వెంకటరమణ అప్పోజి కూర్మా రావు రామారావు అధికారులు పంచాయతీరాజ్ ఇంజనీర్లు సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతిభ పాటవ పోటీలు..

విశాలాంధ్ర - టెక్కలి : మండలంలో రవీంద్ర భారతి స్కూల్లో సోమవారం ఈనాడు ఆధ్వర్యంలో ప్రతిభ పాటవ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. ఈ పోటీలలో అంతర్జాలం వినియోగం వల్ల లాభనష్టాలు, విద్యార్థులపై సామాజిక మధ్య మూల ప్రభావం అనే అంశంపై వ్యాసరచన పోటీలు ఈనాడు కోఆర్డినేటర్ బి భాస్కర్ ఆధ్వర్యంలో 86 మంది విద్యార్థులకు నిర్వహించారు. ఈ వ్యాసరచన పోటీలలో ఎస్ మురళీకృష్ణ (9వ తరగతి), సిహెచ్ జాహ్నవి (10వ తరగతి), బి సాయిదీక్షిత (8వ తరగతి) ప్రథమ ద్వితీయ తృతీయ స్థానాలలో గెలుపొందారు. గెలుపొందిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో రవీంద్ర భారతి స్కూల్ డీన్ వి నాగరాజు, ప్రిన్సిపల్ పద్మజ, ఇద్దరూ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా నందన్న గౌరమ్మ సంబరం.. ఆకట్టుకున్న పగటి వేశాలు

విశాలాంధ్ర - కవిటి : నందన్న, గౌరమ్మ సంబరాలతో పొడియాపుట్టుగ గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది. ఈ మేరకు సోమవారం పంటలు సస్యశ్యామలంగా పండాలని పొడియాపుట్టుగ, ఎర్ర గోవిందపుట్టుగ, సూరిపుట్టుగ, సిహెచ్ పొడియా పుట్టుగ గ్రామాల ప్రజలు మేళ తాళాలు, విచిత్ర వేషధారణలతో నందన్న గౌరమ్మ సంబరాలను గ్రామాలలో ఘనంగా నిర్వహిస్తూ సందడి చేశారు. గత కొద్దిరోజులుగా పొడియాపుట్టుగతో పాటు పరిసర గ్రామాల్లో ఆధ్యాత్మిక చింతనతో వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తూ సంబర వాతావరణాన్ని నెలకొల్పారు. సోమవారం సాయంత్రం నందన్న గౌరమ్మ అమ్మవార్లను గ్రామంలో ఊరేగిస్తూ ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ మేళ తాళాలతో ఘనంగా నిమజ్జన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

నేటికి పల్లెల్లో పట్టువీడని గౌరీదేవి ఉత్సవాల సంబరాలు

విశాలాంధ్ర - జలుమూరు : గ్రామీణ ప్రాంతాల్లో నేటికీ పురాతన ఆచార ప్రకారం రైతులు ఆరాధించే గౌరీదేవి సంబరాలు అంబరానికంటే విధంగా జరుపు కుంటున్నారు. జలుమూరు, సారవకోట మండలాల పరిధిలో అనేక మారుమూల గ్రామాల్లో గౌరీ పౌర్ణమి రోజు రాత్రి నంది వాహనంపై పార్వతీ పరమేశ్వరుల గౌరీదేవి విగ్రహాలకు ఊరేగింపు చేసి ఒక మండపంపై తొమ్మిది రోజులు ఆనందంగా జరుపుకుంటున్నారు. ఉదయం సాయంత్రం వేళల్లో పురాతన మహిళలు జానపద గేయాలతో అందర్నీ అలరిస్తున్నారు. ఈ సాంప్రదాయాలను నేటికీ కొనసాగుతుండడం గొప్ప విశేషం భావితరాల మీద ఒక స్ఫూర్తిదాయకమని పెద్దలు అంటున్నారు. గౌరీదేవి నవరాత్రుల అనంతరం రైతులకు ముమ్మరంగా వ్యవసాయ పనుల్లో పాల్గొనడం ఆచారంగా వస్తుందని పలువురు రైతులు తెలిపారు.

పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేపట్టిన ఎమ్మెల్యే బగ్గు

విశాలాంధ్ర - పోలాకి : మండలంలో పలు గ్రామాభివృద్ధి పనులు సోమవారం స్థానిక ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి శంకుస్థాపన చేశారు. పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాలు కార్యక్రమంలో భాగంగా పోలాకి మండలం, తోటాడ నుండి గొల్లలవలస గ్రామం వరకు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం క్రింద 1 కోటి 20 లక్షల రూపాయల నిధులతో బిటి రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేసి, శంకుస్థాపన చేశారు. అలాగే వనిత మండలం మండలం బ్రిడ్జి నుండి ఎంపీపీ స్కూల్ వరకు మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకం ఒక కోటి 27 లక్షల రూపాయలతో బీటీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేసి శంకుస్థాపన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలు తమపై పెంచుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా పల్లె ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతుందన్నారు. ఏ గ్రామంలో ఏ పనులు అవసరమో వాటిని పూర్తి చేసేందుకు అందుకు తగ్గ నిధులు కూడా విడుదల చేశామన్నారు. మంచి పాలన అందించడమే పాలకుల ఆలక్ష్యమని అందుకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు.కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత గ్రామాల్లో మౌలిక సదుపాయాలు పెద్దఎత్తున కల్పించేందుకు మునుపెన్నడూ జరగని విధంగా గ్రామ పంచాయతీల అభివృద్ధికి వారం రోజులపాటు నిర్వహించనున్న పల్లె పండుగ వారోత్సవాలను నిర్వహిస్తున్నట్టు చెప్పారు. నియోజక వర్గంలో సిసిరోడ్లు, బిటి రోడ్లు, నీటి సంరక్షణ ట్రెంచులు, గోకులాలను పెద్ద ఎత్తున అన్ని గ్రామాల్లో నిర్మిస్తామన్నారు. ఉపాధి నిధులతో నియోజక వర్గంలో పెద్దఎత్తున అభివృద్ధి పనులు చేస్తామన్నారు. మంచి కార్యక్రమాన్ని రూపు దిద్దిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు, ఉపముఖ్యమంత్రి పవణ్ కళ్యాణ్లకు ధన్యవాదాలు తెలిపారు. ప్రజా సంక్షేమ పాలనే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తూ పేదలందరికీ సంక్షేమ పథకాలు అందించే దిశగా కృషి చేస్తుందని వివరించారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ జనసేన ఇంచార్జ్ బలగ ప్రవీణ్ కుమార్ గారు,సోషల్ మీడియా కన్వీనర్ బగ్గు అర్చన మండల నాయకులు మిరియాపిల్లి వెంకతప్పలనాయుడు మాజీ ఏఎంసీ చైర్మన్ బైరి భాస్కర్ రావు కరుకోల రామారావు పంచి రెడ్డి సింహాచలం లు కలాపు రాంబాబు సూరపు నాని ,కూటమి నాయకులు, కార్యకర్తలు మరియు అధికారులు, పంచాయతీరాజ్ ఇంజనీర్లు, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నందన్న ఉత్సవాలు

విశాలాంధ్ర - వజ్రపుకొత్తూరు : మండలం బైపల్లి గ్రామంలో గ్రామస్తులు ఆధ్వర్యంలో నిర్వహించిన నందన్న ఉత్సవాలు సోమవారంతో ఘనంగా ముగిసాయి. ఈ సందర్భంగా పలు పగటి వేషాలు, కోయి దాన్సులు, నృత్యాలు చూపర్లుకు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

దేశ రక్షణలో పోలీస్‌ల పాత్ర శ్లాఘనీయం

లయన్ డా॥ ఎం.కె మిశ్రో

విశాలాంధ్ర - ఎల్ఎన్‌పేట : లక్ష్మినర్సుపేట గ్రామంలో సోమవారం కస్తూరిబా విద్యాలయం నందు లయన్స్ క్లబ్ సర్వీస్ చైర్‌పర్సన్ ,దివ్యాంగ ఉద్యోగ సంఘం రాష్ట్ర నాయుకుడు,సామాజిక వేత్త,సీవ్ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్, సక్షం జిల్లా కన్వీనర్ లయన్ డా.ఎం.కె మిశ్రో ఆధ్వర్యంలో పోలీస్ అమర వీరుల దినోత్సవం ను నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ అమర వీరులకు నివాళు లర్పించారు. సమాజంలో శాంతి బద్రత కాపాడుట నందు పోలీస్ పాత్ర అనే విషయంపై వ్యాసరచన నిర్వహించి ప్రథమ, ద్వితీయ బహుమతులను ప్రధానం చేసారు. ఈ కార్యక్రమంలో కస్తూరిబా విద్యాలయం ఎస్.ఓ ఎం.వి అంబిక, విలేజ్ ఉమెన్ వెల్ఫేర్ సెక్రటరీ భాగ్యలక్ష్మి, ఎడ్యుకేషన్ వెల్ఫేర్ అసిస్టెంట్ లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు లక్ష్మి, ఈశ్వరి, సాధన తదితరులు పాల్గొన్నారు.

సరుబుజ్జిలిలో ఘనంగా పల్లె పండుగ

విశాలాంధ్ర - సరుబుజ్జిలి : రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పల్లె పండుగ కార్యక్రమం చిన్నకాగితపెల్లి పంచాయతీ కి చెందిన బుద్దివలస గ్రామలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది ఎన్.ఆర్.ఈ.జి.ఎస్. మెంబెర్స్ ఆధ్వర్యంలో పంచాయతీ నాయకుల చేతుల మీదుగా మినీ గోకులాల శంకుస్థాపన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతి నాయకుల కూటికుప్పల కోటేశ్వర రావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అభివృద్ధికి దీక్షాదిలా పనిచేస్తుందని, విజన్ 2029 దిశగా అడుగులు వేస్తుందని అన్నారు. ముందుగా పంచాయతీ కార్యదర్శి బి.అనిల్ కుమార్ వాడవలస వెంకటేశం చేతుల మీదుగా కొబ్బరికాయ కొట్టి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో వెంకటేశం మాట్లడుతూ ప్రతివ్యక్తి కి సంక్షేమ ఫలాలు అందించటమే ప్రభుత్వ లక్ష్యమని, వ్యవస్థ ప్రక్షాళన జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో తులగాపు శ్రీను, పైడి పురుషోత్తము, తులగాపు ధనుంజయ్, శ్రీ రంగం రవికుమార్, సీపాన జనార్ధన్, సీపాన మన్మధరావు, కూటమి కార్యకర్తలు మరియు సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ఇద్దరు మైనర్లపై అత్యాచారం..?

- పోలీసుల అదుపులో నిందితులు - ఫిర్యాదుకు ముందుకు రాని బాధిత కుటుంబాలు

విశాలాంధ్ర - పలాస : ఇద్దరు మైనరు బాలికలపై మరో ఇద్దరు మైనర్ బాలురు అత్యాచారం చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దీన్ని మరో వ్యక్తి వీడియోలు తీసి వికృతానందాన్ని పొందడం తీవ్ర సంచలనం రేపింది. శనివారం రాత్రి ఈ సంఘటన జరగ్గా ఆదివారం రాత్రి వెలుగులోకి వచ్చింది. తక్షణం స్పందించిన పోలీసులు మైనర్ బాలురు ముగ్గురిని అదుపులోకి తీసుకొని ప్రశ్నిస్తున్నట్లు సమాచారం. ఈ తతంతంగంపై బాధిత కుటుంబాలు పోలీసులకు ఫిర్యాదు చేయడానికి ముందుకు రావడం లేదు. తమ పరువు బజారులో ఎక్కడ పడుతుందో అన్న సందేహాల మధ్య ఫిర్యాదు చేయడానికి అలోచనలో పడుతున్నట్లు తెలుస్తోంది. పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో 19, 20 వార్డులకు చెందిన ముగ్గురు బాలికలు, ముగ్గురు బాలురు కలసి పలాస మండలం రామకృష్ణ పురం రెవెన్యూ పరిధిలో ఉన్న జగనన్న కాలనీ సమీపంలో నిర్మానుష్యమైన ప్రాంతానికి రాత్రి వెళ్ళి పుట్టినరోజు వేడుకలు జరుపుకున్నారు. అక్కడ అంతా కలసి మద్యం సేవించారు. అనంతరం వారిపై బాలురు వికృతచేష్టలు ప్రారంభించారు. అందులో ఇద్దరు బాలికలు బాలురు చెప్పినట్లు నడుచుకొని వారికి దాసోహం అయ్యారు. అనంతరం వారిపై అత్యాచారం జరిపినట్లు తెలుస్తోంది (ఈ విషయం ఇంకా ధృవీకరించాల్సి ఉంది) మరో బాలిక దీనికి అంగీకరించలేదు. దీంతో ఆ బాలుడు ఇద్దరు మైనర్లపై జరుగుతున్న అత్యాచారాన్ని వీడియోలో చిత్రీకరించి వికృతానందాన్ని పొందినట్లు సమాచారం. ఈ వ్యవహారం బయట పడడంతో విషయం పోలీసుల వరకు వెళ్లింది. ప్రస్తుతం ఈ వ్యవహారం పలాస-కాశీబుగ్గ జంటపట్టణాల్లో హాట్ టాపిక్‌గా మారింది. బాలికలు మైనర్లు కావడంతో బాధిత కుటుంబాలు కూడా ఎటువంటి ఫిర్యాదులు చేయకపోవడంతో పోలీసులు తలలు పట్టుకుంటున్నారు. ముగ్గురు మైనర్ బాలురలను పోలీసులు ప్రశ్నిస్తున్నారు. ఈ వ్యవహారంపై కాశీబుగ్గ సిఐ డి.మోహనరావును వివరణ కోరగా తమకూ ఈ సంఘటన సూచనప్రాయంగా తెలిసిందన్నారు. జరిగిన ఘటన పై తెలుసు కుంటున్నామని, అనుమానిత మైనర్ బాలురలను ప్రశ్నిస్తున్నామన్నారు. సంఘటన అంతా బాలబాలికల చుట్టు ఉండడంతో చైల్డ్రెన్ హెూమ్ సంస్థకు పిర్యాదు చేసామన్నారు. వాస్తవాలు పరిశీలించి వారు ఇచ్చే నివేదిక ఆధారంగా కేసు నమోదు చేయడం జరుగుతుందని చెప్పారు. బాధిత కుటుంబాల నుంచి ఇప్పటి వరకూ ఎటువంటి ఫిర్యాదు అందలేదని చెప్పారు.

అత్యాచార భాదితులపై కఠిన చర్యలు తీసుకోవాలి

పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష

పలాస కాశీబుగ్గ లో ఇద్దరు మైనర్ బాలికలపై అత్యాచారానికి లైనర్ యువకులు పాల్పడిన సంఘటన దారుణమని ఈ వార్త ఎంతగానో బాధించిందని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. భాద్యులు ఎంతటి వారైన వారిపై చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులను కోరామన్నారు. బాధితుల కుటుంబాలకు న్యాయం చేయాలని సిఐ మోహనరావను కోరారు.

పెండింగ్ బకాయిలు మాటేమిటి : ఎస్టీయూ జిల్లా అధ్యక్షులు ఎస్.వి.రమణ మూర్తి

విశాలాంధ్ర - ఆమదాలవలస : ప్రభుత్వ పాఠశాల విద్యకు గొడ్డలి పెట్టుగా ఉన్న 117జీవో రద్దుకు కూటమి ప్రభుత్వం ముందుకు రావడం దానిలో భాగంగా మొన్న 18వ తేదీన విజయవాడలో ఉపాధ్యాయ సంఘాలతో రాష్ట్ర విద్యాశాఖాధికారులు సమావేశం నిర్వహించి తమ అభిప్రాయాలు తీసుకున్నందుకు ధన్యవాదాలు తెలియ జేస్తూ జీవో రద్దుతో ప్రాథమిక పాఠశాలలు తిరిగి గాడిలో పడతాయని ఇది ప్రభుత్వ పాఠశాలలకు మంచి నిర్ణయం కానుందని ఎస్టీయు జిల్లా అధ్యక్షులు ఎస్.వి.రమణ మూర్తి ఆశాభావం వ్యక్తం చేశారు. అక్టోబర్ 16న జరిగిన క్యాబినెట్ సమావేశంలో ఉద్యో గులకు రావలిసిన బకాయిలపై, బకాయిపడ్డ డిఎలపై కనీస చర్చ జరప కపోవడం ఉపా ధ్యాయులను ఆవేదనకు గురిచేసిందని అన్నారు. ఉద్యోగులకు గత ఆరు సంవత్సరా లుగా 25వేల కోట్లు వరకూ బకాయిలు పడ్డా రని ఇందులో గడిచిన ప్రభుత్వమే 21,980 కోట్లు ఉద్యోగులకు బకాయిలు పెట్టినట్లు ప్రస్తుత ముఖ్యమంత్రి ఆర్థికశ్వేత పత్రంలో తెలియజేశారని తెలిపారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలోనైనా ఆ బకాయిలు విడుదల అవుతాయని ఉద్యోగులు ఆశగా ఎదురు చూస్తున్నారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఒక ప్రక్క మీ భాగస్వామ్యంతోనే నడుస్తున్న కేంద్రప్రభుత్వం ఉద్యోగులకు డిఎ రూపంలో దసరా కానుక ఇచ్చిందని మరి ముఖ్యమంత్రి కి ఆంధ్రప్రదేశ్లో ఉద్యోగులు కనిపించడం లేదా? అని ఎస్టీయు జిల్లా అధ్యక్షులు ప్రశ్నిం చారు ప్రశ్నించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తాడివలస నందు ఉపాధ్యాయు లతో జరిగిన సమావేశంలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం మేలుకొని దీపావళి కానుకగానైనా రావలిసిన బకాయిలపై, డి.ఎ, ఐఆర్లపై ఒక ప్రకటన చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.జిల్లా ప్రధాన కార్యదర్శి పి. తమ్మినాయుడు మాట్లాడుతూ 1,2 తరగతులు భోధించే ఎస్జీటీలకు ఇచ్చే ఎఫ్ ఎల్ ఎన్ శిక్షణ నాన్ రెసిడెన్షియల్గా ఉండాలని శిక్షణకు హాజరయ్యేవారిలో చిన్న పిల్లల తల్లులు, వివిధ రకాల అనారోగ్యం తో భాదపడుతున్న వారు ఇంటి దగ్గర వీరి మీదే ఆధారపడ్డ వయోవృద్ధులైన కుటుంబ సభ్యు లు ఉంటారని మరియు మహిళా ఉద్యోగుల ఇబ్బందులను పరిగణలోకి తీసుకొని నాన్ రెసిడెన్సియల్ విధానంలోనే ఉపాధ్యాయుల ఇష్టం మేరకు శిక్షణ పూర్తి చేయాలని విద్యా శాఖాధికారులను కోరారు. సమావేశంలో జిల్లా ఆర్థిక కార్యదర్శి పి.రామకృష్ణ, ప్రధానో పాధ్యాయులు, మిగతా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పల్లెలు అభివృద్ధితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం : ఎమ్మెల్యే బెందాళం అశోక్

విశాలాంధ్ర - కవిటి : ఏ ప్రాంతమైన ముందుగా అభివృద్ధి చెందాలంటే మౌలిక సదుపాయాలు అభివృద్ధి చేయాలని ఇదే తరహా అభివృద్ధి పల్లె ప్రాంతాల నుండి మొదలుపెట్టి పల్లెలు అభివృద్ధి చెందినప్పుడే రాష్ట్ర అభివృద్ధి సాధ్యపడుతుందని ఇచ్ఛాపురం నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ బెందాళం అశోక్ అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన ఇది మంచి ప్రభుత్వం పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా కవిటి పంచాయతీ గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కవిటి పట్టణం మేజర్ పంచాయతీ గుండ్యాలపుట్టుగ, కవిటి టౌను, బొర్ర పుట్టుగ, తొత్తడిపుట్టుగ, కర్రివానిపాలెం, చింతామణి కాలనీ, కొత్త కాలనీ, రామయ్యపుట్టుగ, ప్రగడపుట్టుగ గ్రామాలలో సుమారు కోటి 4లక్షలు అంచనా విలువతో సీసీ రోడ్లకు శంకుస్థాపన కార్యక్రమం ఇచ్ఛాపురం నియోజకవర్గ జనసేన ఇన్చార్జ్ దాసరి రాజుతో కలిసి ఎమ్మెల్యే అశోక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అశోక్ మాట్లాడుతూ ప్రజలు తమపై పెంచుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా పల్లె ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతుందన్నారు. ఏ గ్రామంలో ఏ పనులు అవసరమో వాటిని పూర్తి చేసేందుకు అందుకు తగ్గ నిధులు కూడా విడుదల చేశామన్నారు. మంచి పాలన అందించడమే పాలకుల లక్ష్యమని అందుకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు.కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత గ్రామాల్లో మౌలిక సదుపాయాలు పెద్దఎత్తున కల్పించేందుకు మునుపెన్నడూ జరగని విధంగా గ్రామ పంచాయతీల అభివృద్ధికి వారం రోజులపాటు నిర్వహించనున్న పల్లె పండుగ వారోత్సవాలను నిర్వహిస్తున్నట్టు చెప్పారు. నియోజక వర్గంలో సిసిరోడ్లు, బిటి రోడ్లు పెద్ద ఎత్తున అన్ని గ్రామాల్లో నిర్మిస్తామన్నారు. ఉపాధి నిధులతో నియోజవర్గంలో పెద్దఎత్తున అభివృద్ధి పనులు చేస్తామన్నారు. మంచి కార్యక్రమాన్ని రూపుదిద్దిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కు, ఉపముఖ్యమంత్రి పవణ్ కళ్యాణ్ కు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా సంక్షేమ పాలనే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తూ పేదలందరికీ సంక్షేమ పథకాలు అందించే దిశగా కృషి చేస్తుందని వివరించారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కె.శ్రీనివాసరావు, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అసిస్టెంట్ పి ప్రవీణ్ కుమార్, స్థానిక సర్పంచ్ పూడి లక్ష్మణరావు, మాజీ జెడ్పిటిసి సభ్యులు బెందాళం రమేష్, వి కృష్ణారావు, సీపాన వెంకటరమణ, మణి చంద్ర ప్రకాశ్ రెడ్డి, సదానంద రౌలో, కోర్రాయి వాసుదేవరావు, బెందాళం తిరుమల రావు, లోళ్ల శ్రీను, బాసు దేవు రౌలో, రంగా రౌలో, బార్ల చిన్నబాబు, బత్తిన హేమాచలం, బెందాళం విజయ్ కృష్ణ, పొందూరు బాలకృష్ణ, ఆరింగి మధు, పండి దేవేంద్ర మూర్తి, పుల్లట. రాజు, సింధుల గున్నయ్య, కె. లక్ష్మి, వజ్జ సునీల్, పుల్లట సంతోష్, ఎర్ర బాసు, యర్ర దుర్యోధన, వజ్జ రంగారావు, ఎంఈఓ ధనుంజయ మజ్జి, ఏపిఎం గోవింద్, ఏపీవో మోహన్ రావు, గృహ నిర్మాణ శాఖ ఏఈ రఘు, వివిధ శాఖ అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం తప్పటడుగులు..హామీలు అమలు కోసం ప్రజలు ఎదురుచూపులు

విశాలాంధ్ర - పలాస/మందస : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్ర ఎన్.చంద్రబాబునాయుడు నాయకత్వాన పాలన సాగించి నాలుగు నెలలు గడిచిపోయింది. టీడీపీ, జనసేన, బిజెపి పార్టీల్లో అపారమైన రాజకీయ అనుభవం ఉన్న నేతలు, రాజకీయ మేధావులు ఉన్నారు. ముఖ్యమంత్రిగా ఎన్.చంద్రబాబు నాయుడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోల మూడుసార్లుల చేశారు. ఆంధ్రప్రదేశ్ విభజన తరువాత 2014లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లోను, 2024లో జరిగిన ఎన్నికల్లో ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబు నాయుడు అధికార పగ్గాలు చేపట్టారు. ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడుకు పాలన రంగంలో అపారమైన అనుభవం ఉంది. గతంలో ప్రజలను ఆకర్షించే విధంగా పాలన సాగించారు. కాని ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు పాలన సాగిస్తున్నప్పటికీ ప్రజలను ఆకర్షించే విధంగా పాలన సాగడం లేదని ప్రజలు, కూటమి పార్టీల కార్యకర్తలే పెదవి విరుస్తున్నారు. గత ప్రభుత్వాలు పాలనకు ప్రస్తుత కూటమి ప్రభుత్వ పాలనకు బేరీజు వేసుకొని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వ పాలన తప్పటడుగులు పడుతోందని కారణాలు ఏమిటో అంతుబట్టడం లేదని రాజకీయ పరిశీలకులు సైతం ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ప్రజలను ఆకర్షించే విధంగా సంక్షేమ పథకాలు, కార్యక్రమాలు లేకపోవడంతో ప్రజల్లో వ్యతిరేకత భావం చోటు చేసుకుందని రాజకీయ పరిశీలకులు అంటున్నారు. దీనికి సంబంధించి వివరాలిలా ఉన్నాయి. గత వైసీపీ ప్రభుత్వ పాలనలో ఏర్పాటు చేసిన గ్రామ సచివాలయాల వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యమైంది. సచివాలయాల్లో ఆన్‌లైన్ సేవలు పూర్తిగా లేవు. సచివాలయాలకు వేళలకు ఉద్యోగులు హాజరు మాత్రం ఉంది. ఆదాయం, కుల ధృవీకరణ, ఓబిసి సర్టిఫికేట్లు కోసం దరఖాస్తులు చేసుకున్న ధరఖాస్తుదారులకు సర్టిఫికేట్లు మంజూరైనప్పటికీ ఒక నెల నుంచి రెండు నెలలు పడుతోంది. సచివాలయాల ద్వారా డెత్, బర్త్ సర్టిఫికేట్లు మంజూరు కావాలన్నా ఎన్ని రోజులు పడుతోందో తెలియని పరిస్థితి నెలకొంది. గతంలో ప్రతీ రోజు ప్రజలతో కళకళలాడే సచివాలయాలు పాలన నిర్వీర్యమైంది. దీనికి ప్రత్యామ్నాయంగా క్లస్టరు విధానంలోని వ్యవస్థను ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ కొత్త వ్యవస్థకు ఇంత వరకు అంకురార్పణ జరగలేదు. ప్రజల సమస్యలు పరిష్కారం కోసం ఏ కార్యాలయానికి వెళ్లాలో తెలియని పరిస్థితి నెలకొంది. రాష్ట్రస్థాయి, జిల్లాస్థాయి ప్రభుత్వానికి సంబంధించి కాల్ సెంటర్ల ఫోన్ నెంబర్లు కూడా ప్రజలకు ప్రభుత్వం తెలియజేయలేదు. గతంలో ప్రజలు కాల్‌సెంటర్ల ఫోన్‌నెంబర్లకు నేరుగా సమస్యలుపై చెబితే సమస్యలు పరిష్కారం అయ్యేది. ప్రస్తుతం కాల్‌సెంటరు ఫోన్ నెంబరులో జాడ లేదు. దీంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం ప్రజల వద్దకు పాలన సాగించాలి. కాని ప్రజలకు అవస్థలు పాల్జేయలడం, ప్రజలు ఎవరికీ ధరఖాస్తులు సమస్యలపై సంక్షేమ పథకాలు కోసం ఇవ్వాలో తెలియని పరిస్థితి నెలకొంది. సచివాలయం ఉద్యోగులకు ప్రతీ నెల మొదటి వారం సామాజిక పింఛన్లు పంపిణీ బాధ్యతను ప్రభుత్వం అప్పగించింది తప్ప మరి ఎటువంటి విధులు అప్పగించకుండా పాలన వ్యవస్తకు దూరం ఉంచడం పట్ల చర్చ జరుగుతోంది. గత వైసీపీ ప్రభుత్వ పాలనలో మహిళలకు చేయూత పథకం కింద ఆర్థిక సహాయం, డ్వాక్రా సంఘాలకు సున్నా వడ్డీ చెల్లించలేదు. చదువుకున్న విద్యార్థులకు ఫీజు రీఎంబార్సుమెంటు డబ్బులు, వసతి, విద్యాదీవెన పథకాలు డబ్బులు చెల్లించలేదు. అసెంబ్లీ ఎన్నికల కోడ్ అడ్డు కావడంతో లబ్ధిదారులకు చెల్లింపులు జరగలేదు. పెండింగ్‌లో ఉన్న ఇటువంటి చెల్లింపులు అన్ని కూటమి ప్రభుత్వం చెల్లిస్తుందని ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబునాయుడపై ఆశ పెట్టుకున్నారు. కాని ఇంత వరకు పెండింగ్ బకాయిలు చెల్లింపులు జరగలేదు. దీంతో ఈ వర్గాలన్నీ అసంతృప్తితో ఉన్నారు. ఇకపోతే మద్యం విక్రయాలు జరుగుతున్న తీరు పట్ల మద్యం ప్రియుల్లో నిరసన వ్యక్తమవుతోంది. ఎంఆర్‌పి రేట్లకన్నా మద్యం సిండికేట్లు అధిక ధరలకు అమ్ముతున్నారు. మద్యం రకాలుపై కూడా ఎంఆర్‌పి ధరలు భారీగా పెంచారు. దీంతో మద్యం ప్రియులు తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నారు. వితంతు, వృద్ధాప్య, వికలాంగులు, కిడ్నీ వ్యాధిగ్రస్తులు తదితర అర్హులైన బాధితులు సామాజిక పింఛన్ల కలోసం ఎదురు చూస్తున్నారు. గత ఏడాది అక్టోబరు నుంచి వీరంతా ధరఖాస్తులు చేశారు. ఏడాది అవుతున్న వీరికి ఇంత వరకు పింఛన్లు మంజూరు చేయలేదు. పింఛన్ల కోసం ఎదురు చూస్తున్న పేదలంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతులకు ఇస్తామన్న రైతు భరోసా 20వేల రూపాయలు చెల్లించలేదు. పండుగ కానుకలు లేవు. ఇళ్ల స్థలాలు, కాలనీ ఇళ్లు మంజూరు లేవు. ఏడాదికి 3 ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇవ్వడం లేదు. తల్లికి వందనం పేరుతో ఒక్కొక్క విద్యార్థికి 15వేల రూపాయలు ఇవ్వడం లేదు. నిరుద్యోగుల భృతి 3 వేల రూపాయలు మాట వినిపించడం లేదు. 50ఏళ్ల దాటిన బిసి, ఎస్సీ, ఎస్టీలకు సామాజిక పింఛన్లు మంజూరు మాటలు, ఆర్టీసిలో మహిళలకు ఉచిత ప్రయాణం హామీ, 18 ఏళ్ల నిండిన మహిళలకు నెల 1500 రూపాయల ఆర్థిక సహాయం వంటి కూటమి ప్రభుత్వ హామీలు మాటలు ప్రస్తుతం గ్రామాల్లో చర్చ జరుగుతుంది. ఇలా చెప్పుకుంటూ పోతే కూటమి ప్రభుత్వం హామీలు ఇంకా ఎన్నెన్నో. ప్రభుత్వం ఇప్పటికైనా హామీలు అమలు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

బంగారం చోరీకి పాల్పడిన వ్యక్తి అరెస్టు

విశాలాంధ్ర - మెలియాపుట్టి : మెలియాపుట్టి మండలం టాకోయ్ గ్రామానికి చెందిన పల్లి కనకమ్మ ఇంట్లో బంగారం చోరీకి పాల్పడిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఇన్చార్జ్ సబ్ ఇన్స్పెక్టర్ లావణ్య తెలిపారు. దీనికి సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. మెలియాపుట్టి మండలం సంతలక్ష్మీపురం పంచాయతీ పరిధిలో గల టాకోయ్ గ్రామానికి చెందిన పల్లి కనకమ్మ వృద్ధురాలు ఇంట్లో వంట చేసుకుంటుండగా ఇంట్లోకి చొరబడి పుస్తెలతాడును అపరహించుకుపోయిన సంఘటన శుక్రవారం రాత్రి జరిగిందని దీనికి సంబంధించి ఒరిస్సా సరిహద్దు గోప్పిలి గ్రామం వద్ద సదరు చోరీకి పాల్పడిన వ్యక్తి లోకేశ్వర్ రావు ను సోమవారం నాడు పట్టుకొని అరెస్టు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. దొంగతనానికి పాల్పడిన వ్యక్తి దగ్గర నుండి బంగారాన్ని తీసుకొని వృద్ధురాలికి అప్పజెప్పడంతో పాటు ఆయన్ని కోర్టుకి హాజరు పరిచినట్లు ఎస్సై తెలిపారు. సబ్ ఇన్స్పెక్టర్ లావణ్య తోపాటు సిబ్బంది ఉన్నారు.

అక్రమ కబ్జా చర్చి నిర్మాణాన్ని అడ్డుకోండి

విశాలాంధ్ర - పొందూరు : జిల్లా కలెక్టర్, రెవెన్యూ అధికారుల ఆదేశాలు భే ఖాతర్ చేస్తూ అనుమతులు లేకుండా అక్రమ కబ్జా చేసిన చర్చి నిర్మాణాన్ని అడ్డుకోవాలని మండలం కృష్ణాపురం ఆనందాశ్రమంలో స్వామీ శ్రీనివాసా నందను సోమవారం జి.సిగడాం మండలం చీడిపేట గ్రామస్తులు కోరారు. చీడిపేట గ్రామంలో ఇళ్ళమధ్య ప్రభుత్వస్థలంలో 282 సర్వేనంబరు కంబాల చెరువు బంధ గర్భంలో చర్చి నిర్మాణం చేపడుతున్నారని పుస్తకాల దుకాణానికి విద్యుత్ కనెక్షన్ కోసం పంచాయతీ నుంచి ఎన్ సి పొంది చర్చి నిర్మాణం చేస్తున్నారని స్వామీజికి వినతిపత్రం అందించారు. దీనిపై జి. సిగడాం తహసీల్దార్‌తో మాట్లాడానని, నిర్మాణానికి ఎటువంటి అనుమతులు తీసుకోలేదని తాసిల్దార్ చెప్పినట్లు స్వామీజీ తెలిపారు. చర్చి నిర్మాణం ఆపకపోతే హిందూ సంఘాలతో ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

సౌత్ జోన్ బాడ్మింటన్ పోటీలకు బీఆర్ యూ విద్యార్థులు

విశాలాంధ్ర - ఎచ్చెర్ల : ఈ నెల 26 నుంచి 29వ తేదీ వరకు చెన్నై (తమిళనాడు) లో ఎస్ఆర్ఎం యూనివర్సిటీ ఆవరణలో జరగనున్న సౌత్ జోన్ బాడ్మింటన్ పోటీల్లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ తరపున జట్టు పాల్గొంటోంది. ఈ జట్టు క్రీడాకారులు సోవ వారం వర్సిటీ వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజనిని కలిశారు. ఈ పోటీల్లో విజయం సాధించాలని వీసీ ఆకాంక్షించారు. వర్సిటీ స్పోర్ట్స్ డీన్ డాక్టర్ యు.కావ్యజోత్స్న, పీడీలు డాక్టర్ ఎం.శ్రీనివాసరావు, డాక్టర్ ఎ. భాస్కర్ పాల్గొన్నారు.

ఆటో ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

విశాలాంధ్ర - నందిగాం: మండలం కవిటి అగ్రహారం గ్రామానికి చెందిన బాలు ఇంటి నుండి పూండి వెళుతుండగా అగ్రహారం వద్ద ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొట్టినట్లు స్థానికులు తెలిపారు. ఈ ప్రమాదంలో బాలు తీవ్రంగా గాయపడటంతో వెంటనే అతన్ని అంబులెన్స్ లో ఆసుపత్రికి తరలించారు.

వసతిగృహాలలో సమస్యలపై దృష్టి

విశాలాంధ్ర - పొందూరు : వసతి గృహాలలో సమస్యల పరిష్కారంపై వసతిగృహ అధికారులు దృష్టిసారించాలని పొందూరు జూనియర్ సివిల్కోర్టు జడ్జి బి. జ్యోత్స్న చెప్పారు. మండలం రాపాక సమీపంలోని ఎంజెపీ పాఠశాల వసతిగృహాన్ని సోమవారం తనిఖీ చేశారు. ఇంటికి దూరంగా ఉంటున్న చిన్నారుల ఆరోగ్యం అత్యంత ముఖ్యమని అన్నారు. వసతిగృ హంలో వంటగది, వంట సామానులను పరిశీలించారు. అనంతరం వసతిగృహంలో సౌక ర్యాలపై విద్యార్థులతో మాట్లాడారు. జడ్జితో పాటు న్యాయవాదులు ఎం. రాము, కె.అశోక్, టి.సంతోష్ తదితరులు ఉన్నారు.

ముగిసిన ఏపీ టెట్ పరీక్షలు

విశాలాంధ్ర - ఎచ్చెర్ల : ఉపాధ్యాయ అర్హత పరీక్షలు (ఏపీ టెట్-2024) ఈ నెల 3వ తేదీన ప్రారంభమై సోమవారంతో ముగిసాయి. జిల్లాలోని మూడు కేంద్రాల్లో శ్రీ శివానీ ఇంజనీరింగ్ కళాశాల (చిలకపాలెం), శ్రీ వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాల (ఎచ్చెర్ల), కోర్ టెక్నాలజీస్ (నరసన్నపేట) లో రోజుకు రెండు షిఫ్ట్ ఈ పరీక్షలు జరిగాయి. మొత్తం అన్ని రోజుల్లో కలిపి శ్రీ వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాలలో మొత్తం 3,201 మందికి 2,865 మంది అభ్యర్థులు హాజరుకాగా, 336 మంది గైర్హాజరయ్యారు. శ్రీ శివానీ ఇంజనీరింగ్ కళాశాలలో 1,020 మందికి 918 మంది హాజరుకాగా, 102 మంది గైర్హాజరయ్యారు.

మీ కోసం కార్యక్రమానికి 40 వినతలు

విశాలాంధ్ర - శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం : సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల నమోదు మరియు పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ పి శ్రీనివాసరావు 40 మంది ప్రజల నుంచి పిర్యాదులు స్వీకరించి, వారితో ముఖాముఖి మాట్లాడి, ఫిర్యాదు దారుల సమస్యలను తెలుసుకొని పూర్తి స్థాయిలో పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. ఫిర్యాదు దారుల అర్జీలు,వారి వివరాలు సంబంధిత పోలీసు అధికారులకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తక్షణమే తెలియ పరిచి చట్ట ప్రకారం చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని అదేశించారు. ప్రజా పిర్యాదులు పట్ల అత్యంత ప్రాధాన్యత ఇస్తూ, నిర్లక్ష్యం వహించకుండా త్వరితగతిన పరిష్కారం చూపాలని సూచించారు. ఈ క్రమంలో జిల్లా అదనపు ఎస్పీ స్వయంగా అర్జీ దారులు వద్దకు వెళ్లి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఆయా ఫిర్యాదులపై తీసుకున్న చర్యలను నిర్ణీత సమయంలో జిల్లా పోలీస్ కార్యాలయానికి నివేదిక రూపంలో పంపించాలని అదనపు ఎస్పి అధికారులు ఆదేశించారు. పిర్యాదులు

వివరాలు: సివిల్ తగాదాలు పై 5, మోసపూరితమైన అంశాలు పై 5, మిసింగ్ కేసుపై 2, సైబర్ నేరాలపై 2, కుటుంబ తగాదాల పై 3, ప్రాపర్టీ అంశాలపై 2, పాత పిర్యాదులు 11, ఇత్రారత అంశాలపై 10 ఫిర్యాదులు స్వీకరించారు.

మహిళా ఉత్పత్తులను ఓఎన్‌డిసిలో నమోదు : ఏపీఎం కూర్మారావు

విశాలాంధ్ర - హిరమండలం : మహిళా సంఘాలు తమ ఆదాయ అభివృద్ధి కార్యక్రమాల కోసం పొందిన రుణాల ద్వారా చేపడుతున్న ఉత్పత్తులన్నింటినీ చక్కగా మార్కెటింగ్ చేసుకోవడానికి ప్రభుత్వం నూతనంగా ఓ.న్.డి.సి. (ఆన్ లైన్ డిజిటల్ కామర్స్) విధానం అమలు లోనికి తెచ్చినట్లు వెలుగు జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ పైడి కూర్మారావు తెలిపారు. సోమవారం మండల సమాఖ్య పరిధిలోగల కొండ రాగోలు మరియు గులుమూరు పంచాయతీలో క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సంఘాల పనితీరుతో పాటు స్వంత యూనిట్లో నడుపుతున్న సంఘ సభ్యులతో మాట్లాడారు. సంఘాలలో యూనిట్లు పెట్టుకున్న మహిళలకు వ్యక్తిగతంగా ఉమెన్ లీడ్ ఎంటర్ప్రైజెస్ ద్వారా రుణాలు మంజూరు చేయించాలన్నారు. సంఘ సభ్యులు తమ సొంత నిధులను పూర్తిగా వినియోగించుకొని, మండల సమాఖ్య, గ్రామ సంఘాల ద్వారా మహిళా కుటుంబాలు ఏర్పాటు చేసుకుంటున్న చిన్న, మధ్యతరగతి, కుటీర పరిశ్రమలకు అవసరం మేరకు శ్రీనిధి రుణాలను పొందవచ్చని తెలిపారు. మహిళలు తయారు చేస్తున్న ముఖ్యంగా ఆహార ఉత్పత్తులకు మంచి ప్యాకింగ్, బ్రాండింగ్ తో మీ సంస్థను మీ లోగో తో సహా రిజిస్ట్రేషన్ చేయించుకొని, ఆన్లైన్ మార్కెటింగ్ విధానాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ కోఆర్డినేటర్ అప్పలస్వామి, వి.వో.ఏ.లు మోహిని, గిరి దేవి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఏయూలో విద్యార్థినులకు కరాటే శిక్షణ

విశాలాంధ్ర - ఎచ్చెర్ల : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీలో హాస్టల్ విద్యార్థినులకు ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం ఆధ్వర్యంలో ఆత్మరక్షణ, ఆత్మవిశ్వాసం పెంపొందించడానికి కరాటే శిక్షణ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని మాట్లాడుతూ విద్యార్థినుల కోసం ప్రత్యేకించి ఈ శిక్షణా తరగతులు ప్రారంభించామన్నారు. ఈ శిక్షణను విద్యార్థినులు సద్వి నియోగం చేసుకోవాలన్నారు. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం రెండు పూటలా ఈ తరగతులు జరుగుతాయన్నారు. ఈ కార్య క్రమంలో కరాటే శిక్షకురాలు ఆర్.ఝాన్సీ, పీడీలు డాక్టర్ ఎం.శ్రీనివాసరావు, డాక్టర్ ఎ. భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.